కథానిక

# విశాలహృదయాలు

"రమణశ్రీ"

"ఎవరండీ మీరు? ఎవరికోసం!" లోపలికి నిరాటంకంగా ప్రవేశిస్తూన్న వ్యక్తిని చొరవ చేసి నిలుపుతూ ప్రశ్నించింది కల్యాణి.

ఆ వ్యక్తికి ముప్పయిసంవత్సరాల లోపు వయసుంటుంది. అయినా నిష్కారణంగా తలలో నెరసిన వెంట్రుకలు, అక్కడక్కడ యౌవనాన్ని గేలిచేస్తున్నయ్ సూర్యకాంతికి మెరుస్తూ, ఎత్తుగా తరంగాలుగావంగిన జుట్టుముఖంలో కళీభవిస్తోంది!

ముఖం ప్రశాంతంగామార్చి, "లోనికినడవండి చెప్తాను—మీకోసమే నారాక"—

కళ్యాణి వచ్చినవ్యక్తినిచూచి, అతని ఆలోచనలేని చొరవకి అసహ్యించుకొంటూ, లోపలికి దారితీసింది. అతనిమీద తనకెలాంటి సదభిప్రాయమూ అంకురించడంలేదు.

"మీ చొరవకి అర్థం తెలీడంలేదు"— అందామనుకొంది కాని కల్యాణి కా మాటలు గొంతులోనే ఇగిరిపోయాయి.

"మీ రెందుకొచ్చినట్టు? నాతో అవసరం?"

"మీరు ప్రెసిడెన్సీ కాలేజీలో చదివారు కదూ? మీ పేరు కళ్యాణికదూ? మీకు ఫణీంద్రశయన, అనే వ్యక్తి పరిచయమే కదూ?"

"అవన్నీ ఇప్పుడెందుకు? అప్పుడే ఎనిమిది సంవత్సరాలు కావస్తున్నది."

ఆగంతుక వ్యక్తి గొంతుసవరించుకొని—

"ఆ ఫణీంద్రశయననే నేను!"

కళ్యాణి ఏలోకంనించో త్రుళ్ళిపడింది. ఏదో చెప్పలేని భావంతో వణికిపోయింది.

"ఆఁ ఫణీంద్రవా?...ఎలా మారిపొయ్యావ్! నేను గుర్తేపట్టలేదు...జ్ఞప్తిలోలేవు క్షమించు... అవును, ఆ కాలేజీ ఆ రోజులు...అవన్నీ తలుచుకొంటే వళ్లు గగుర్పొడుస్తుంది"

ఫణీంద్ర ఆలోచనలేకండా కళ్యాణితో సమంగా ఆ మధన అనుభవిస్తున్నాడు.

"నేను ఢిల్లీలో పనిచేస్తున్నా... వెయ్యి రూపాయలు జీతం. ఎలవెన్సులూ, కారూ, బంగ్లా అంతా రాజవైభోగం." కల్యాణికి ఆ మాటలు వింటూంటే భయంవేసింది. తనూ, తన భర్తా కలిసి సంవత్సరానికి వెయ్యిరూపాయలు కూడా సంపాదించలేరు. అలాంటిది ఫణీంద్ర ఒక నెల-ముప్పయిరోజుల్లో-సంపాదిస్తున్నాడు.

"మీ రెలాగయినా గొప్ప గవర్నమెంటు ఉద్యోగులు! మిమ్మల్నెలా సత్కారంచేయాలో నాకర్థంకావటం లేదు— క్షమించు. ఇదివరకటి విషయాలన్నీ మరిచిపో"

ఫణీంద్ర గంభీరముద్ర వహించాడు.

"మనం కాలేజీలో ఆనాడు చేసుకొన్న బాసలు, జ్ఞాపకంలేదూ? నేనే అడి తప్పాను... ఉద్యోగాలకోసం పోవలసివచ్చింది—ఎనిమిది సుదీర్ఘపు సంవత్సరాలు."

కల్యాణి భయపడింది.

"నీకు వివాహం కాలేదా? ఇప్పు డెందుకొచ్చావ్? నాకు వివాహమైపోయింది. నాలుగు సంవత్సరాలయింది. నీకోసం,వెర్రితలలువేసి ప్రేమ ప్రేమని పలవరిస్తూ కూచున్నా, రాని నీకోసం ఆగలేని నేను తల్లిదండ్రుల మాట జవదాటలేక పెళ్ళి కొప్పుకొన్నాను. ఆయనకూడా హైస్కూల్లో పని చేస్తున్నారు. నేనుకూడా అక్కడే."

ఫణీంద్ర గంభీరంగా నవ్వుతూ, "అలాంటిదేం భయంలేదు కల్యా! ఇప్పుడైతేనేం? నాతో రాలేవా? ఆయనతో కొంతకాలం వున్నావనే ఈర్ష్య నాకు లేశంలేదు."

కల్యాణి గుండె ఒక్కసారి ఆగినట్టయింది. పెద్ద నిట్టూర్పు విడుస్తూ, "వేళాకోళమా? ఫణీంద్రా! కాలేజీలోవేసిన నాటకమనుకొంటున్నావా? జీవితం!-కథలోలా పారిపోయొచ్చెయ్యమంటావా? నీకు న్యాయమని ఎలా తోచింది? ఇంకా నామీదకు ప్రేమెందుకు? ఇలాంటి అస్తవ్యస్తకార్యం ఎలా సాధించగలం? నలుగురు నోళ్లూ విప్పడమే అవుతుంది."

కల్యాణి మాటలువింటూ ఫణీంద్ర లేచాడు. "తర్వాత కలుసుకొంటాం ఆలోచించుకో. వారం రోజుల్లో వెళ్ళిపోతున్నా-"

కల్యాణి గుమ్మందాకా వెళ్ళింది. ఫణీంద్ర రోడ్డుమళ్ళేదాకా కళ్ళల్లోకళ్లు పెట్టుకు చూచింది. హృదయంలోహృదయం పెట్టుకొని మరీ ఆలోచించింది. చెవుల్లో చెవులుపెట్టుకొని అతను చెప్పినమాటల్ని మరీ మరీ వింది.

ఒకనాడేనాడో తనహృదయ దేవాలయంలో ఆశాదీపం వెలిగించి, ఆర్పేసిపోయిన ఫణీంద్ర తిరిగి నేడు తుఫాన్లు చెలరేగదీయడానికి వచ్చాడు. అధికారదర్పంతో చూచేవాళ్ళకి ఈర్ష్యాకరంగా తన సాంగత్యాన్ని అపేక్షిస్తూ వచ్చాడు. అగ్ని సాక్షిగా వివాహమాడినవ్యక్తిని వదిలేసి, తనతో రమ్మనేటంత సాహసంలో వచ్చాడు.

కిం కర్తవ్యం? ఎలా ఈ అగ్నిజ్వాలనిఆర్పడం? కల్యాణి చెలరేగిన తుఫాన్లని గుండెలో బంధించివేస్తూ, కనుమూపుమేరలో ఎర్రగా మండుతోన్న సంధ్యను చూచింది. పెదవులమీద రక్తపువేడి కక్కుతూన్న కీలల్ని పరామర్శించింది. నల్లని చీకట్లనుంచి, తప్పించుకోవాలనే ఆవేదన ప్రతి గుండెలోనూ మరుగుతోంది!

* * *

కృష్ణశర్మ కల్యాణి ముఖంలో పరిణామాన్ని గుర్తిస్తూ— "ఇవాళదోలా వున్నావే?"

"ఎలావున్నా? బాగానే వున్నానే!"

"నీలో ఏదో చెప్పలేని మార్పుంది! దాన్ని గురించి నేను తెలుసుకోవచ్చా?"

"మీరు భర్తలు- నన్నుగురించి తెలుసుకొనే అధికారం వుంది."

"నన్నుగురించి, నీవు తెలుసుకొనే అధికారం లాగే!"

కల్యాణి, కృష్ణశర్మమాటలకి అభిమానపడుతూ "ఇద్దరంకలిసి సంపాదిస్తున్నాం. ఇద్దరికీ సమానాధికారాలున్నాయ్."

"నిన్ను ఉద్యోగం చేయమన్న దెవరూ? నేవద్దన్నా పట్టుపట్టి చేరింది నీవేనా? మరెవ్వరైనానా? నలుగుర్లో నాకు తలవంపులు! నేనుచేసేదే కాక, పెళ్లాంచేతకూడా ఉద్యోగం చేయిస్తున్నానని!"

"పోన్లెండి! నేననేది, అది కానేకాదు. ఆ ప్రస్తావన రానీకండి! నాకు మనసులో బాగులేదు."

కృష్ణశర్మ మరి మాటాడలేదు. కల్యాణిలో ఇదివరకటికీ ఇప్పటికీ మార్పేమిటి? అది తను గుర్తించలేకపోతున్నాడు. భోజనంచేసి పడుకున్నాడు. ఏదో రెక్కలు తెగిన ఆలోచన. కిటికీ రెక్క తెరచి చూశాడు. నల్లటి ఆకాశం పొగలాగ వ్యాపించిన చీకటి-అంతకంటె తనకేం కనిపించలేదు.

కల్యాణిలో ఏదో కొత్త బాధ ప్రవేశించింది. దాన్నిగురించి ఏమిటో, ఏం చెప్పాలో తెలీని అగమ్యత! ఒకవిధంగా ఫణీంద్ర వచ్చి తనలో పూర్వపుటాశల్ని చెలరేగతీశాడా? ఇంద్రజాలంపన్ని తుఫాన్లు తన హృదయంలో సృష్టిస్తున్నాడా? లేక తనుతనే, స్వయంకృతాపరాధిలా మనసు పాడుచేసుకొన్నదా?

తనకెందుకిన్ని ఆశలూ? ఫణీంద్రునిమీదికి మళ్ళీ మన సెందుకు మళ్ళిపోవాలి? అతను ఒకనాటివాడు -తను వివాహిత- భర్తతో కాపురంచేస్తూ ఉంది.

తనలోబాధ! రాత్రి పన్నెండుగంటలకి నిద్రలేచిచూచింది. శర్మ నిశ్చింతగానిద్రపోతున్నాడు. తను నిద్రలేక లేచింది. రెప్పల్ని బరువుగా ఎత్తిచూచింది. దుర్భరంగా మండుతున్నయ్. ఆరని ఆశలు మంటలు పెడుతోన్న కళ్లు— తెరలు తెరలుగా చీలిపోతూన్న కలలు—

ఆతనితో వెళ్ళిపోతే!... వెయ్యిరూపాయల జీతం... కార్లు...షికార్లూ... అతీతమైన గౌరవం... ప్రతిపత్తి.

"పోతాను వెళ్ళిపోతాను. ఈ ముష్టికొంపలో ఉండను. సౌఖ్యాల్ని దోపిడీచేయడానికి అతనితో వెళ్ళిపోతాను."

తిరిగి పక్కమీదకొచ్చి నిద్ర నటించింది. ఊహలు రంగురంగులతెరల్లో చిరిగిపోతున్నాయి.

* * *

తెల్లవారినా కల్యాణి ముఖం తెల్లవారలేదు. రాత్రి నిద్రలేని ఆలోచనలతో, కళ్లు తామరపువ్వుల్లాగ ఎర్రబారివున్నయ్.

కృష్ణశర్మ ఎగాదిగాచూస్తూ, "నీ మనసులో బాధ చెప్పవ్?" అన్నాడు.

కల్యాణి నీరసంగా క్షణంపాటు నవ్వి గంభీర ముఖం వహించింది.

"ఎక్కడికన్నా వెడతారా?"

"ఆఁ" అన్నాడు జవాబుగా- "వెడతాను" అంటూ చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వు అర్థం భాషకి తెలియంది——

కొంత సేపటికి కల్యాణి అలంకరించుకొని, ఫణీంద్రశయన, విశ్రాంతి గృహానికి బయల్దేరింది.

బంగ్లా-పూలతోట - ఉదాత్తమైన సౌందర్య కళాఖాండాన్ని చిత్రించిన,చిత్రకారుని చిత్రంలా వుంది, ఆ పరిసర వాతావరణం——

లోపలికి అడుగు పెట్టబోయింది.

"హాల్లో కల్యాణీ! లోపలికి రా!"

ఫణీంద్ర గంభీరంగా ఆహ్వానించాడు. ఆ ఆహ్వానంలో కల్యాణికి కన్నూ మిన్నూ తెలీలేదు. ఎనలేని ఆనందానికి గురయింది. ఆ వైభవం, ఆ వైభోగం——రైమని తిరిగే ఫేన్లూ-కుషన్లూ-సోఫాలూ...కళ్లూ వళ్లూ తెలీని ఆనందంలో అందంగా ఫణీంద్రవైపు చూచింది.

ఒయ్యారా లొలకబోస్తూ, సౌందర్య రసాన్ని ఎగజిమ్ముతూ వున్న కల్యాణిని చూచేసరికి, ఫణీంద్ర నయనాలు మధువు తాగినంత ఉత్సాహాన్ని పొందాయి.


ఫణీంద్ర చిరునవ్వులొంచి, మాటల్ని తుంచి వేస్తూ, "అంతా నీ చలవేలే కల్యాణీ! ఈ ప్రపంచంలో ఇంకా నాకోసం నీవున్నావనే, పరుగెత్తుకొంటూ వచ్చాను."

"నిజంగానా?" అంది కల్యాణి నమ్మలేని నయనాల్లో కాంతి వెలారిస్తూ.

"వారంరోజుల్లో వెళ్ళిపోతాను, నీతోసహా" అన్నాడు ఫణీంద్ర- ఆ మాటలు వినిపించుకోలేని ఆనందంలో కల్యాణి సమాధానం వినపడలేదు.

* * *

"నువ్వు చెప్పకపోయినా తెలుసులే కల్యాణీ" కృష్ణశర్మ బాధగా ముఖం పెట్టి ఈ నాలుగూ అన్నాడు. తను చెప్పకపోయినా, తెలిసే విషయం తన కెదురుగా వుండనే వున్నది—— కృష్ణశర్మని పూర్తిగా వంచించాననే భావం ఆమెలో నల్లని



"సాంధ్యవేళ"

——చిత్రకారుడు : హెచ్. వి. రామగోపాల్.

మచ్చని ఊహించింది. తన హృదయంలోంచి, ఒక శకలం రాలిపడ్డది.

"నీ ఆనందానికీ, నీ ప్రవర్తనలకీ నేనడ్డురాలేదు తెలుసా!" కల్యాణి హృదయంలోంచి మరో శకలం రాలిపడ్డది. నీ ప్రవర్తన శంకించి కూడా నేనడ్డురాలేదంటే గూఢార్థం? అతని ఒక్కొక్క మాట, ఒక శూలంవలె- ఒక అగ్నిజ్వాలవలె- తన కాళ్ళక్రింది భూమిని త్రవ్వి పారేసి, అగాధాన్ని సృష్టిస్తోంది!

కంఠంలో దుఃఖాన్ని అదిమిపట్టుకొంది.

"నన్ను పరామర్శించకండి! మీరు వెళ్ళిపొండి. నా దుఃఖానికీ సౌఖ్యానికీ అడ్డురాకండి."

"నేనెప్పుడూ రాను... ఫణీంద్ర శయనతో వెళ్ళిపో దలుచుకుంటే వెళ్ళిపో, నిర్భయంగా! పూర్వప్రణయాలని పురస్కరించుకొని, నువ్వు కాపురంచేశావనే లెక్కలేకండా, నీతో తిరిగి జీవించడానికి సువిశాల హృదయంతో నిన్నాహ్వానిస్తోన్న ఆ ఫణీంద్రశయనకంటె, నేను తక్కువ వాణ్ణికాను! నాలో హృదయ వైశాల్యముంది. గుర్తించుకొని, నీవు వెళ్ళవచ్చు" కృష్ణశర్మ మాటలు కాదు ఆపుచేస్త, కల్యాణి హృదయాన్ని! ఒక్కసారి కల్యాణి కంఠంలో దుఃఖం పొంగి వెల్లువలైంది.

"అతనితో సుఖించు. నీ సుఖాలకీ ఆనందాలకీ నే నడ్డురాను. వైభవాలు అనుభవించాలనే ఆశ అందరికీ వుంటుంది. నీ చిన్ననాటి ప్రేమికుడు, అతనితో అనుభవించు. నీ వనుభవించబోతున్నావని నా కేమాత్రం ఈర్ష్యలేదు. నేను స్వార్థపరుణ్ణి కాను."

కృష్ణశర్మ నవ్వుతూ, కల్యాణి కళ్ళల్లో కన్నీళ్ళని తుడిచాడు. వర్షం కురిసిన మేఘాల్లా కళ్లు మెరుస్తున్నాయ్. కల్యాణి ఆవేశాన్ని దిగమింగుతూ, "నన్ను పొమ్మంటారా? మీనించి విడిపొమ్మంటారా? సమాజ మేమంటుంది? లోకు లేమంటారు?...అయితే మీ హృదయంలో నాకిక విశ్రాంతిలేదూ? చెప్పండి..." కృష్ణశర్మ రొమ్ముని గట్టిగా తలతో రుద్దుతూ, "నేనేనా? స్వార్థపరురాల్ని...సుఖాలకోసం మరొకడితో పొమ్మంటారా? నే వెళ్ళను-వెళ్ళలేను" అంది కర్కశంగా.

"మనసు చలింపజేసుకోకు. లోకులూ సమాజం భయం మనకిలేదు"

"ఊహుం అతనితో నే చెప్పేస్తా రానని. అతనితో లేచిపోవడానికి నే నెవర్ని? మీనించి వేరుచేసి తీసుకుపోవడానికి అతనెవరూ?"

"కాదు తప్పకండా నీవు వెళ్ళితీరాలి."

కృష్ణశర్మ ఆమెని దగ్గరగా తీసుకొని, చెదిరిన వక్షోచ్ఛాదనని, సరిదిద్దుతూ లాలించాడు.

"ఇక వెళితే రాలేనేమో?" అంది కల్యాణి.

* * *

ప్రయాణం సిద్ధమైంది-ఫణీంద్ర తయారుగా వున్నాడు. విచారాన్ని నీళ్ళల్లో కలిపి తాగినట్టు మత్తుగా వచ్చింది కల్యాణి. మారురూపు దాల్చిన శోకదేవతలావుంది.

"ఇదేం?" అన్నాడు ఫణీంద్ర.

అతనికి తెలిసిందా? వెళ్ళొద్దన్నాడా? మూర్ఖుడు కొట్టాడా? నేను ఎంత విశాల హృదయంతో నిన్నురమ్మని ఆహ్వానించాను? అర్థం చేసుకోలేకపోయాడా? ఏం జరిగింది నాతో వచ్చేస్తావా?...

కల్యాణి గద్గదికంగా "నేను రాలేను" అని మూల్గింది,

వెంటనే ఫణీంద్ర పకపక నవ్వుతూ, "బయల్దేరు! ఇదా నీ పిచ్చి? నువ్వు రాగలవు! నడు... ఆలస్యం విషంగా మారుతుంది... పద."

కారులోనే తీసుకుపోయాడు.

కల్యాణి పెదవులు కదపలేదు.

అతని పెదవులలో వైభవం!

రైల్లో సామానంతా ఎక్కించేశారు! కల్యాణిని సహితం ఫణీంద్ర ఎక్కించేశాడు.

దూరంనించి, ఈ దృశ్యాన్నంతా కళ్ళల్లో వత్తులు పెట్టుకు చూస్తూన్న కృష్ణశర్మ, తన హృదయాన్ని ద్విభాగాలుగా వేరుచేసి తీసుకుపోతోన్నట్టు బాధపడ్డాడు. పచ్చదీపం చూసిన రైలు, జీవితంలో ఏం ప్రమాదంలేనట్టు ధైర్యంగా చీకటిని త్రవ్వకొంటూ ముందుకు సాగిపోతోంది.

కృష్ణశర్మకి ఆ రైలుకూత, స్వార్థంలేని హృదయాల అనురాగం ప్రతిబింబించే వెలుతురూ... అన్నీ పంచరంగులదృశ్యాన్ని ఊహించి చూపెడుతోంది.

★